నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం
21 ఫిబ్రవరి 2026 పేజీలు : 08





# వెలుగొండలో.. ఎర్ర దొంగలు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని శేషాచల అటవీ వెలుగొండ రిజర్వు ప్రాంతాల్లో అక్రమ సంపాదన లక్ష్యంగా బరితెగిస్తున్న కొందరు ఎర్ర స్మగ్లర్లు, మాఫియాలకు అడ్డూ అదుపు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. అటు ప్రభుత్వానికి.. ఇటు ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టెరిటోరియల్ ఫ్లయింగ్ స్క్వాడ్ విభాగాల అధికారులకు సవాల్‌గా మారినట్లు తెలుస్తుంది.

- ఎర్రచందనం ఆధారిత ప్రాంతాలే టార్గెట్
- బరితెగిస్తున్న స్మగ్లర్ల మాఫియా.. నేలకూలుతున్న భారీ వృక్షాలు
- జిల్లా సరిహద్దులు దాటుతున్న రూ.లక్షలాది ఎర్ర సంపద
- సినీఫక్కీలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్.. ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్న అటవీ శాఖ !
- పాత ముద్దాయిలపై అనుమానాలు.. నిఘా !

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు జిల్లాలోని రాపూరు, నెల్లూరు, ఆత్మకూరు, ఉదయగిరి తదితర ఎర్రచందనం ఆధారిత ప్రాంతాలకు చెందిన అటవీ రేంజ్‌లను తమ అక్రమ కార్యకలాపాలకు అడ్డగా ఎంచుకున్న బడా స్మగ్లర్లతో పర్సెంటేజీల ఒప్పందం కుదుర్చుకున్న కొందరు స్థానిక చోటా స్మగ్లర్లు.. తమకున్న పరిచయాలతో కూలీలను పురమాయించడంతోపాటు దగ్గరుండి ఎర్రచందనం వృక్ష సంపదను గొడ్డలి వేటు, రంపపు కోతలతో నెలకూలుస్తున్నారు. ఇదే క్రమంలో మరో అడుగు ముందుకేస్తున్న కొండ కింద గ్రామాలకు చెందిన కొందరు అడవి దొంగలు.. అరుదైన ఎర్ర చందనం దుంగలను వినూత్న పంథాల్లో జిల్లా సరిహద్దులు దాటించేందుకు పైలెట్లు మారుతూ ఆపసోపాలు పడుతుండటం గమనార్హం. ఇదే క్రమంలో ఆసక్తికరమైన అంశాలతో ప్రజలకు వినోదంతోపాటు సందేశాన్ని అందించే ఉద్దేశ్యంతో తెరకెక్కించిన 'పుష్ప', పుష్ప-2 భాగాల సినిమాల్లోని కొన్ని సన్నివేశాలను తమ అక్రమ కార్యకలాపాలకు అనుకూలంగా మార్చుకున్న ఎర్ర స్మగ్లర్లు అదే పంథాలను అనుసరిస్తూ మరింత రెచ్చిపోతూ అడ్డు అదుపూ లేకుండా అడ్డదిడ్డంగా ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని పసి గట్టిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మరింత అప్రమత్తంతో రంగంలోకి దిగుతున్న పోలీస్ స్పెషల్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేస్తూ కూంబింగ్‌లు.. మెరుపు దాడులతో ఎర్రదొంగల పంథాలను తిప్పికొడుతుంటే.. అటవీ అధికారులు మాత్రం ప్రేక్షక పాత్రకే పరిమితమైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రత్యేకించి తిరుపతి శేషాచలం కొండలు నుంచి ఉదయగిరి వయా నెల్లూరు, రాపూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి వరకు విస్తరించి ఉన్న

-మిగతా 2లో





# ఇక్కడ నేనే.. మోనార్క్

- ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చవల ఓవరాక్షన్
- విలేకరులపై దురుసు ప్రవర్తన
- ఏరియా ఆసుపత్రిలోకి రాకూడదని ఆంక్షలు !
- సిఆర్ కృష్ణ హుకుం జారీ..

**కావలి, మేజర్‌న్యూస్ :**

కావలి ఏరియా వైద్యశాలకు విలేకరులు రాకూడదంటూ.. ఓ ఛానల్ రిపోర్టర్‌పై ఏరియా వైద్యశాల కమిటీ డైరెక్టర్ చవల రామకృష్ణ ఓవరాక్షన్ చేస్తూ వాగ్వాదానికి దిగి హుకుం జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ హాస్పిటల్‌లో బైక్ నిలుపుకొని ఉన్న తిరుమల అనే రిపోర్టర్‌ను ఏరియా వైద్యశాల కమిటీ డైరెక్టర్ చవల రామకృష్ణ.. ఈ సమయంలో 'నీకెక్కడ ఏం పని ?' అని నిలదీస్తూ, నేను ఇక్కడ మోనార్క్ అని, నాకు తెలియకుండా ఇక్కడ ఏం పని అంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో చవల రామకృష్ణ తీరు పట్ల జర్నలిస్టులందరూ

-మిగతా 2లో

## ఇంటికో మహిళా పారిశ్రామికవేత్త తయారు చేయడం సీఎం చంద్రబాబు లక్ష్యం

- ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలకు శ్రీకారం చుట్టి 25 ఏళ్లు పూర్తి కావస్తుంది
- మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డ్వాక్రా సంఘాల సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించుకోబోతున్నాం
- ప్రతి ఇంటి నుండి ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పం
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



వివరాలు 2లో




02 పేజీలో

## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం పలికిన ఎంపీ వేమిరెడ్డి

ఉదయం ఏఐ సమ్మిట్‌లో పాల్గొననున్న సీఎం

## తెలుగుజాతి గౌరవం ఢిల్లీకి చేర్చిన

# మహోన్నత వ్యక్తి నేదురుమల్లి



- 91వ జయంతి సందర్భంగా ఘన నివాళులు
- నుడా అధికారుల అనుమతితో త్వరలోనే ఎన్‌జేఆర్ విగ్రహం ఏర్పాటుకు కృషి
- నెల్లూరు అర్బన్, రూరల్ నుండి నూతనంగా 200 మంది కాంగ్రెస్‌లో చేరిక
- నేదురమల్లి జయంతి సందర్భంగా పలువురికి దుప్పట్లు పండ్లు పంపిణీ
- డీసీసీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి 91వ జయంతి సందర్భంగా జిల్లా డీసీసీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నేదురమల్లి జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దివంగత కాంగ్రెస్ నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి గానే గాక పార్టీలో సీడబ్ల్యూసీ మెంబర్‌గా ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించి తెలుగు జాతి గౌరవం ఢిల్లీకి చేర్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అదేవిధంగా నెల్లూరు నగరంలో నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసేందుకు నెల్లూరు అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలను, మున్సిపల్ కమిషనర్, నుడా అధికారుల అనుమతులు అడిగి త్వరలో వారి విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నేదురుమల్లి గొప్ప వ్యక్తి కాబట్టి పార్టీలకు అతీతంగా ఆయన విగ్రహం ఏర్పాట్లకు అన్ని పార్టీలు కలిసి రావాలని ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ కేవలం ఎమ్మెల్యే ఎంపీ పదవుల కోసమే కాదు రాష్ట్రం దేశం కోసం ఏర్పడిన పార్టీ



అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడదీసినప్పుడు ప్రజల మనోభావాలు దెబ్బతిని ఆంధ్రప్రదేశ్లో ప్రజలు పార్టీకి దూరంగా జరిగారన్నారు. ఒకప్పుడు భాషా ప్రాతిపదికన తెలంగాణ, ఆంధ్రను కలిపింది కాంగ్రెస్ పార్టీయే అని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించిన రాష్ట్ర ప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టు కు జాతీయ హోదా, కడప ఉక్కు కర్మాగారం, ఇండస్ట్రియల్ కారిడార్ మొదలైన ఎన్నో బిల్లు పెట్టామన్నారు. అదేవిధంగా రాష్ట్రం విడిపోయాక మొదటిసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు బిజెపి మెడలు ఉంచుతానని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని.. రాష్ట్రంలో తమ పార్టీ ఎంపీలను గెలిపిస్తే పార్లమెంట్లో పోరాడి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తానని చెప్పిన వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట మర్చిపోయారని, చంద్రబాబు జగన్ ఇద్దరు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని ప్రశ్నించలేరని తెలియజేశారు. అంతేకాకుండా బిజెపి ప్రభుత్వం బ్యాంకులను, రైల్వేలను కూడా అమ్మేసేందుకు సిద్ధమై పోతున్నారని తెలిపారు. నెల్లూరు జిల్లా అక్కంపేటలో షర్మిలమ్మ ఉపాధి పరిరక్షణ యాత్ర తర్వాత జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు రూపొందుకున్నాయని ప్రజాస్వామ్యం కోసం, దేశ ప్రయోజనాల కోసం, పేద బడుగు బలహీన వర్గాల మేలు కోసం మైనార్టీల హక్కుల కోసం రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. అనంతరం నెల్లూరు అర్బన్ మరియు రూరల్ పరిధిలోని పలు డివిజన్లో సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సివి శేషారెడ్డి, డాక్టర్ యశోదర, సిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్, జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, లీగల్ సెల్ చైర్మన్ అడ్వకేట్ సుధీర్, అనంతపురం ఇన్చార్జి నరసింహులు, మైనార్టీ నాయకులు అల్లావుద్దీన్, రెహమాన్, రూరల్ మల్లికార్జున్ రెడ్డి, హుస్సేన్ బాషా, మల్లీ కిషోర్ రెడ్డి, బద్రి, కిషోర్, నాగరాజు, తుమ్మ వాసు, వివిధ పార్టీల నేదురమల్లి అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికో మహిళా పారిశ్రామికవేత్త తయారు చేయడం సీఎం చంద్రబాబు లక్ష్యం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే నవసమాజ నిర్మాణం సాధ్యం అవుతుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో మెప్మా ఆర్థిక సహాయంతో స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శారీ రోలింగ్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలకు శ్రీకారం 25 ఏళ్లు పూర్తికావస్తుండటం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డ్వాక్రా సంఘాల విజయాలను పురస్కరించుకొని సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకోబోతున్నామని ఆమె వెల్లడించారు. నాడు చంద్రబాబు నాయుడు వేసిన డ్వాక్రా సంఘాల పునాది నేడు మహిళల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు కేవలం ఇంటికే పరిమితమైన మహిళలు పొదుపు సంఘాలలో సభ్యులై నేడు స్వయం ఉపాధి రంగాల్లో రాణించడం మహిళా సాధికారతకు నిదర్శనమన్నారు. ప్రతి ఇంటి నుండి ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. పొదుపు మహిళల ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాలెంలో ప్రారంభించిన ఈ శారీ రోలింగ్ సెంటర్ దినదినాభివృద్ధి చెంది మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆదర్శం కావాలన్నారు. మెప్మా ద్వారా పొదుపు సంఘాలకు ఆర్థిక సహాయం అందించి వారు సొంతంగా వ్యాపారాలు చేసుకునేలా ప్రభుత్వం నిరంతరం ప్రోత్సహిస్తుందని హామీ ఇచ్చారు. మార్చి 8 నుంచి డ్వాక్రా మహిళల కోసం ప్రత్యేక రుణ పథకాలను ప్రభుత్వం అమలు చేయబోతోందని ప్రశాంతి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్లు శివకుమార్ రెడ్డి, పటాన్ నస్రీన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు శేషయ్య, నగర అధ్యక్షులు శ్రీనివాసులు, జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, బుచ్చిరెడ్డిపాలెం పట్టణ కౌన్సిలర్లు, టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం పలికిన ఎంపీ వేమిరెడ్డి

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ స్థాయిలో ఢిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొనేందుకు ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వాగతం పలికారు. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయానికి చేరుకున్న సీఎంకు ఎంపీ ఆహ్వానం పలికారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఏపీకి పెట్టుబడులు, సంస్థలు సాధించేలా సీఎం చంద్రబాబు పర్యటన సాగనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు నైపుణ్యాలు కల్పించేలా ప్రతిష్టాత్మక ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. ఏపీలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీతోనూ రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకోనుంది. ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రం ఏర్పాటు కోసం యూనిసీసీ సంస్థతోనూ ఒప్పందం జరుగనుంది. ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రకటన అనంతరం క్వాంటెలా ఇంక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ గాంధీతోనూ సమావేశం, వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించే రౌండ్‌టేబుల్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఏఐ సమ్మిట్ వేదిక వద్దే యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రతినిధి బృందంతోనూ సీఎం భేటీ కానున్నారు. అనంతరం అరామ్కో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ అయితుక్రైర్, అడోబ్ సీఈఓ శాంతనూ నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్‌మైక్ హాలేతో సీఎం వేర్వేరుగా సమావేశం కానున్నారు.

## ఇక్కడ నేనే మోనార్క్ !

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోకి రావద్దనడానికి, వీడియోలు తీయవద్దనడానికి మీరు ఎవరని.. మీకు ఏ అధికారం ఉందని.. పట్టణంలోని జర్నలిస్టులందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రశ్నించారు. సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియాపై ఆంక్షలు పెట్టడం, మా స్వేచ్ఛకు భంగం కలిగించే హక్కు మీకు ఎవరు ఇచ్చారని, మీ మాటలను వెనక్కి తీసుకోవాలని పలువురు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అయితే రామకృష్ణ తీరు ప్రస్తుతం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఆసుపత్రిలో జరుగుతున్న లోపాలు, రోగుల ఇబ్బందులు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉండేందుకే ఆయన ఈ విధమైన 'నిరంకుశ' ధోరణిని ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం పత్రికా విలేకరుల పైనే కాకుండా, వైద్యశాలలో వైద్యం అందిస్తున్న సిబ్బంది పట్ల కూడా డైరెక్టర్ వ్యవహార శైలి అభ్యంతరకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ పని చేస్తున్న ఎంబీబీఎస్ వైద్యులను సైతం ఆయన తక్కువ చేసి మాట్లాడుతూ, అహంకార ధోరణి ప్రదర్శిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రిలో జరిగే పరిపాలనా పరమైన లోపాలను ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకుని ఆయన దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి నేతల చేసే పనుల వలన పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై వైద్యశాల కమిషనర్, కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వెలుగొండలో.. ఎర్రదొంగలు

(మొదటి పేజీ తరువాయి)

అటవీ రిజర్వు ప్రాంతాలను తమ అడ్డదారి కార్యకలాపాలకు అనువుగా ఎంచుకున్న స్మగ్లర్లు యదేచ్ఛగా ఎర్ర చందనం అక్రమ రవాణా సాగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు పసిగడుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధక చట్టం టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు నేతృత్వంలో రూపొందించిన ప్రత్యేక యాక్షన్ ప్లాన్ కార్యాచరణ మేరకు విస్తృత గాలింపులు, మెరుపు దాడులతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ అధికారులు లక్షలాది రూపాయల విలువ చేసే దుంగలు.. వాహనాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితులను అదుపులోకి తీసుకొని ఎర్ర చందనం ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచి ట్రాక్ రికార్డులు సొంతం చేసుకున్నారు. 2014-19 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎర్ర చందనం అక్రమ రవాణా కట్టడిపై కఠిన చర్యలతో ఉక్కుపాదం మోపిన టాస్క్‌ఫోర్స్ దాటికి తట్టుకోలేని స్థితిలో కొందరు బడా.. చోటా స్మగ్లర్లు అజ్ఞాతంలోకి జారుకున్నారు. ఇదే క్రమంలో మరికొందరు స్మగ్లర్లు స్వచ్ఛందంగా కోర్టుల ముందు లొంగిపోయి శిక్షలు అనుభవించారు. అయితే 2019-24 వరకు ప్రభు త్వం మారడం వైసీపీ అధికారంలోకి రావడంతో ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడిపై దృష్టి సన్నగిల్లడంతో.. ఇదే అదనుగా భావించి రంగంలోకి దిగిన బడా.. చోటా స్మగ్లర్లు ఆజ్ఞాతం నుంచి బయకు వచ్చి యదేచ్ఛగా తమ అక్రమ కార్యకలపాలను కొనసాగించారు. అయితే 2024 జూన్‌లో వైసీపీ అధికారం కోల్పోవడం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎర్రచందనం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కి పడి ఉక్కిరిబిక్కిరి అయిన వైసీపీ తొత్తులుగా చెప్పుకొని తిరిగిన స్మగ్లర్లు.. ఉన్నఫళంగా రాత్రికి రాత్రే టీడీపీ పంచన చేరి.. టీడీపీ జెండా మోస్తూ భజన చేయడం మొదలుపెట్టారు. అయితే 'ఇంగువకట్టిన గుడ్డ వాసన పోదు' అన్న చందంగా ఎర్రచందనం అక్రమ రవాణాతో నోట్లకట్టలకు అలవాటుపడిన కొందరు చోటా.. బడా స్మగ్లర్లు నేటికీ అదే పంథాను కొనసాగిస్తుండటంతో అధికారులకు పరోక్షంగా సవాల్ విసురుతున్న సంకేతాలను తలపిసున్నాయి. ఏది ఏమైనప్పటికి ఎర్రచందనం అక్రమ రవాణా నియంత్రణలో బాధ్యతతో వ్యవహరించాల్సిన అధికారులు, సిబ్బంది లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ.. నిమ్మకు నీరెత్తిన చందంగా నిద్రావస్థలో జోగుతుంటే, కరుడుగట్టిన స్మగ్లర్ల పంథాలను తిప్పికొడుతూ.. ట్రాక్ రికార్డులతో దూసుకుపోతున్న పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు చూపుతున్న ప్రత్యేక చొరవ పట్ల సర్వత్రా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

# సోలార్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టోల్ ఫ్రీ 1912

- నెల్లూరు జిల్లా సోలార్ వినియోగదారులకు చక్కని అవకాశం
- సోలార్ విద్యుత్ సమస్యలపై 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయండి
- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలోని సోలార్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కొరకు టోల్-ఫ్రీ నంబరు 1912ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి.. సోలార్ విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు కాల్ సెంటర్‌కు కాల్ చేసి సంప్రదించడం ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. కాల్ సెంటర్లో సోలార్ సంబంధిత ఫిర్యాదులను కూడా నమోదు చేసే సౌకర్యాన్ని నూతనంగా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. వినియోగదారులు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవిఆర్ఎస్) ద్వారా ఫోన్/మొబైల్ స్క్రీన్ పై 5 అంకెను నొక్కి సోలార్ విద్యుత్ సమస్యపై పిర్యాదులను నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నిర్దిష్ట సమయంలోపు సంబంధిత సోలార్ పరికరాల విక్రేత సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమస్యను పరిష్కరించిన వెంటనే వినియోగదారునికి ఫీడ్ బ్యాక్ కాల్ చేయబడుతుందని, వినియోగదారుడు ఇచ్చే ఫీడ్ బ్యాక్‌కు అనుగుణంగా పిర్యాదును మూసివేయడం/ తెరవబడటం జరుగుతుందన్నారు. ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఏఐ విప్లవం.. గ్రామీణ భారతానికి గ్లోబల్ అవకాశాల దారి



**చిలక ప్రవీణ్ కుమార్**

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం వేగంగా విస్తరిస్తోంది. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగం, రవాణా వంటి ప్రతి రంగంలోనూ ఇది రూపాంతరాత్మక మార్పులకు నాంది పలుకుతోంది. ఈ నేపథ్యంలో చిలక డిజిటల్ సొల్యూషన్స్ ఎండి, ఏఐ టెక్ నిపుణుడు చిలక ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. 'ఏఐ ఒక టెక్నాలజీ మాత్రమే కాదు, ఇది భారతదేశ భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాది. సరైన విధానాలు, సమర్థ వినియోగం ఉంటే గ్రామీణ భారతానికి కూడా గ్లోబల్ అవకాశాలు తీసుకువస్తుంది' అని అన్నారు. ఇటీవల నిర్వహించిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగానూ ఆయన ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ, పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు కలిసి ఏఐ ఆధారిత ఆవిష్కరణలపై చర్చించి దేశ అభివృద్ధికి మార్గదర్శక సూచనలు చేశాయని తెలిపారు. ఐటీ, కస్టమర్ సపోర్ట్, డేటా ప్రాసెసింగ్ రంగాల్లో ఏఐ ఇప్పటికే తన ప్రభావాన్ని చూపుతోందని, అయితే ఇది ఉద్యోగాలను పూర్తిగా తొలగించదని, పనితీరును మార్చి మానవ సామర్థ్యాన్ని పెంచే సాధనంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. స్మార్ట్ చాట్‌బాట్స్, ఆటోమేటెడ్ డేటా అనాలిసిస్ టూల్స్ సంస్థల పనిని వేగవంతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను అధిగమించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోందని, స్కాన్ రిపోర్టుల విశ్లేషణ ద్వారా టీబీ, డయాబెటిక్ రెటినోపతి, ఎపిలెప్సీ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించే సామర్థ్యం పెరుగుతోందని తెలిపారు. 'ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఐ ఆధారిత డయాగ్నస్టిక్ టూల్స్ అమలు చేస్తే ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతాయి' అని చెప్పారు. విద్యా రంగంలో ప్రాంతీయ భాషల్లో వ్యక్తిగత మార్గదర్శనం అందించడంలో ఏఐ కీలకమైందని, పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు స్మార్ట్ మానిటరింగ్ సిస్టమ్స్ ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. 'భవిష్యత్ విద్య పర్సనలైజ్డ్ లెర్నింగ్ వైపు అడుగులు వేస్తోంది. ప్రతి విద్యార్థి అవసరానికి అనుగుణంగా కంటెంట్ అందించడం సాధ్యమవుతోంది' అని వివరించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలో మట్టి విశ్లేషణ, వాతావరణ సమాచారం, పంటల సలహాలు రైతులకు సకాలంలో అందుతున్నాయని, అమూల్ వంటి సంస్థలు ఏఐ ద్వారా స్థానిక భాషల్లోనే పశువుల ఆరోగ్యం, ఉత్పాదకతపై సూచనలు అందిస్తున్నాయని తెలిపారు. 'రైతు చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. ఏఐ అతని వ్యక్తిగత సలహాదారుడిగా మారుతుంది' అని అన్నారు. చేనేత రంగంలో టాటా కన్సల్టెన్సీ సర్వీస్ రూపొందించిన ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యూవర్ ద్వారా వాయిస్ కమాండ్స్‌తోనే చీరల డిజైన్లను మార్చుకునే సదుపాయం కల్పించబడిందని చెప్పారు. 'చేనేత రంగం టెక్నాలజీతో కలిస్తే గ్లోబల్ మార్కెట్‌లో కొత్త అవకాశాలు తెరుచుకుంటాయి' అని అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక రంగంలో ఆయిల్ రిగ్స్, పవర్ ప్లాంట్స్ వంటి ప్రమాదకర ప్రాంతాల్లో ఏఐ ఆధారిత స్మాట్ రోబోలు తనిఖీలు నిర్వహించడం ద్వారా మానవ ప్రాణాలకు ముప్పు తగ్గుతోందని వివరించారు. అలాగే రవాణా రంగంలో అల్ట్రా వైలెట్ ఎఫ్77 వంటి ఎలక్ట్రిక్ బైకుల్లో రాడార్, ఇన్-బిల్ట్ కెమెరాలతో ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు అమలులోకి వచ్చాయని తెలిపారు. మొత్తంగా ఏఐ విప్లవం ఇంకా ప్రారంభ దశలో ఉన్నప్పటికీ, పరిశ్రమలు, స్టార్టప్‌లు, ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే ఇది దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన దిశను నిర్దేశిస్తుందని, రాబోయే సంవత్సరాల్లో ప్రతి కుటుంబాన్ని, ప్రతి రంగాన్ని ప్రభావితం చేయడం ఖాయం అని చిలక ప్రవీణ్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## అన్నాక్యాంటిన్‌ను పరిశీలించిన తుమ్మల



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని అన్నాక్యాంటిన్‌ను శుక్రవారం పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పరిశీలించారు. అక్కడ భోజనాల నాణ్యతను, పరిశుభ్రతలను ఆయన పరిశీలించారు. భోజనాలు ఆరగిస్తున్న వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. భోజన నాణ్యత, శుచి,శుభ్రతల గురించి అడిగి అత్యంత సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ పేదలకు 5రూపాయలకే నాణ్యమైన భోజనం ఏర్పాటు చేసి వారి ఆకలి తీర్చాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చాంద్రబాబునాయుడు అన్నాక్యాంటిన్‌లను ఏర్పాటు చేశారన్నారు. కాగా గత ప్రభుత్వం ఈక్యాంటిన్‌లను రద్దుచేయగా 2004లో మళ్ళీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు అన్నాక్యాంటిన్‌లను పునరుద్ధరించారన్నారు. పేదలు కేవలం 5రూపాయలకే సరిపడా భోజనం చేసి కడుపునింపుకుంటుండడం ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు. ఈసౌకర్యం కల్పించడం ప్రతినిత్యం వందలాదిమందికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. భోజన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా 5రూపాయలకే పేదలకడుపు నింపుతున్నామని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిత్యం వందలాదిమంది వినియోగించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎంతమంది వచ్చినా 5రూపాయలకే అన్నాక్యాంటిన్‌లో భోజనం లభిస్తుందని చంద్రారెడ్డి పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.శ్రీధర్**

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు టౌన్ డివిజన్ అధీనంలో ఉన్న 33/11 కె.వి. తెలుగు గంగ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి నేతాజీ నగర్ ఫీడర్ కింద మరమ్మత్తులు, లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఎన్‌బిటి కాలనీ, శివాజీ నగర్, ఎన్ సీసీ కాలనీ, డైకస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మన్నేపల్లి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**సరస్వతీ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో :** 33/11 కె.వి. సరస్వతీ నగర్ సబ్ స్టేషన్‌లోని 11 కెవి సరస్వతీ నగర్ ఫీడర్ కు మరమ్మత్తులు.. చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా సరస్వతీ నగర్, మాగుంట సుబ్బారామిరెడ్డి ఇంటి పరిసర ప్రాంతాలు, కెవిఆర్ పెట్రోల్ బంక్, రైతు బజార్ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8:00 నుండి ఉదయం 11:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ మార్పులను సహృదయులైన వినియోగదారులు గమనించి, సంస్థ అభివృద్ధికి సహకరించాలని, అత్యవసర విభాగం వారు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

## 25లోపు రైతు విశిష్ట గుర్తింపు నమోదు పూర్తి చేయాలి

**అయ్యగారిపాలెం, తాటిపర్తిలో ప్రత్యేక శిబిరాలు**



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని అయ్యగారిపల్లి, తాటిపర్తి గ్రామాలలో రైతు విశిష్ట గుర్తింపు కార్డు నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ హాజరై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట గుర్తింపు నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో వ్యవసాయ శాఖకు సంబంధించిన అన్నదాత సుఖీభవా, ప్రధానమంత్రి కిసాన్, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్ల సబ్సిడీలు, బ్యాంకు రుణాలు వంటి అన్ని పథకాలకు రైతు విశిష్ట గుర్తింపు ఉన్నవారే అర్హులవుతారని తెలిపారు.అందువల్ల ఈనెల 25వ తేదీ లోపు తమ వ్యవసాయ భూమి పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజమోహన్ రెడ్డి, వీఏఏలు గోవర్దన్, శివారెడ్డి, ఇంద్రజ, ప్రతాప్, అనిల్, అయ్యగారిపాలెం సర్పంచ్ కండే వసంతమ్మ, కండే నరసయ్య రైతు తదితరులు పాల్గొన్నారు.

## దంతులూరి వెంకటేశ్వరరావుకు బొల్లినేని పరామర్శ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు శుక్రవారం వింజమూరులో ఉదయగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దంతులూరి వెంకటేశ్వరరావుని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఇటీవల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న దంతులూరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ.. దంతులూరి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయం ఎప్పుడైనా అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా ఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో సరస్వతీదేవి పూజ





**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యాదేవి సరస్వతీదేవి పూజను భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన అమ్మవారి చిత్రపటాలు ముందు విద్యార్థులు, అధ్యాపకులు భక్తిపూర్వకంగా నమస్కరించి విద్యాభివృద్ధి కోసం ప్రార్ధనలు చేశారు.శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి మండప ప్రాంగణం భక్తిరసంతో నిండిపోయింది. పూజా కార్యక్రమం అనంతరం విద్యార్థులకు మార్చి 2026లో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ మహీంధర్ రెడ్డి, ప్రభుత్వ టీచర్ నౌరాజ్, కళాశాల కరస్పాండెంట్ ఎం.సుధాకర్‌రెడ్డి, జీ.ఎన్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బారావు, అకడమిక్ డీన్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సత్ప్రవర్తనతో క్రమశిక్షణగా చదివి ఈనెల 23 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ బోర్డు పబ్లిక్ పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు. గత ఏడాది లాగే స్టేట్ మార్కులు 467,466 పైగా సాధించాలని, అత్యధిక మార్కులు సాధించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు రాచపూటి ధనుంజయ రావు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జేవీవీ ఆధ్వర్యంలో మండల స్థాయి వక్త పోటీలు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం వక్త పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిలకపాడు, మర్రిపాడు, పొంగూరు, కస్తూరిబా గాంధీ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా మొదటి బహుమతిని చిలకపాడు ఉన్నత పాఠశాలకు చెందిన సురేంద్ర రాణించాడు. అలాగే ద్వితీయ బహుమతిని అదే చిలకపాడు పాఠశాలకు చెందిన హర్ష వర్ధన్, తృతీయ బహుమతిని మర్రిపాడు ఉన్నత పాఠశాలకు చెందిన లాస్య సాధించింది. వీరికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బసిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కొక్కంటి పోలయ్య, మర్రిపాడు మండల అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు కుంభగిరి వేణుగోపాల్, సీతారాంపురం మండల అధ్యక్షులు తమ్మిశెట్టి శ్రీనివాసులు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ తగు మెమొంటోలను అందజేయడం జరిగింది. విద్యార్థుల



యొక్క ప్రతిభను వెలికి తీసేందుకే జనవిజ్ఞాన వేదిక ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని జేవివి సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

# జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20 నుండి 28 వరకు జరిగే సైన్స్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కావలి పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం నందు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. అనంతరం అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మూఢవిశ్వాసాలను తొలగించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంచి పర్యావరణాన్ని పరిక్షించుకునే క్రమంలో జన విజ్ఞాన వేదిక ముందుకు వస్తుందని తెలిపారు.రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. రేపటి పౌరులైన నేటి బాలల్లో శాస్త్రీయతను పెంచే విధంగా వివిధ అంశాలను ఎంపిక చేసి వాటిని ఆధారంగా వివిధ పోటీలో నిర్వహిస్తున్నామని అందులో భాగంగా శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. జూనియర్స్ విభాగంలో 6,7 తరగతి సీనియర్స్ భాగంలో 8, 9,10, తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూపుకి ముగ్గురు విద్యార్థులు చొప్పున 40 గ్రూపుల పాల్గొనగా మొత్తం 120 మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొన్నారని తెలిపారు. జూనియర్ విభాగానికి' శాస్త్రీయ దృక్పథం సమాజ అభివృద్ధికి ఎలా దోహదం చేస్తుంది. అనే శీర్షికపై సీనియర్ విభాగానికి విద్య వైద్య వ్యవస్థలను నిర్వహించడం ప్రభుత్వం బాధ్యత అనే అంశంపై నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్ కోశాధికారి టి.సుబ్బరామ శర్మ ఉపాధ్యక్షులు కందికట్టు నారాయణ, సి.కన్నయ్య కార్యదర్శి శారద కార్యవర్గ సభ్యులు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వామి అమ్మవార్లకు వెండి వింజామర

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా జొన్నవాడ క్షేత్రం, శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంకు పొదలకూరు వాస్తవ్యులు కర్ణం కామాక్షి ఆర్థ్య పేరున కర్ణం కామాక్షి కార్తిక్ శ్రీ స్వామి అమ్మవార్ల పై భక్తితో నిత్య ఆర్జిత సేవల్లో ఉపయోగించిటకు సుమారు 94 గ్రాములు విలువైన వెండి వింజామర దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాత గోత్రనామములతో శ్రీ మల్లికార్జున స్వామి వారికి శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదములు అందజేశారు.



## సీసీ రోడ్లు నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణానికి రూ.1.78 కోట్లతో మంజూరైన సిమెంట్రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈఈ చెరుకూరు మణికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టే కోళ్లవీధి, యాదవవీధి, నాగులబావివీధి ప్రాంతాలను ఆయనపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏలాంటి లోపాల్లేకుండా రహదారుల నిర్మాణాలు చేపట్టాలన్నారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన కొలతలను కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రోడ్ల నిర్మాణం చేపట్టి సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## డిపో ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ ఉద్యోగుల ధర్నా



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో పలు డిపోలను ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సంస్థను ప్రైవేటు కంపెనీకి అప్పగిస్తే ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకమవడంతోపాటు అనేక కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ప్రభుత్వం ప్రైవేటీకరణ విషయాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ ఎస్థాని, భోగ్యం వెంకటేశ్వర్లు, బకీరు జాషువా, రవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలకు బెంచీల వితరణ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆల్తుర్తి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పట్టణంలోని రోజ్ ధార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీతారామపురం, ఉదయగిరి ఎంఈవోలు మస్తాన్వలి, శ్రీనివాస లు మాట్లాడుతూ.. రోజ్ ధార్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు అస్లాం, మన్సూర్లు తాము విద్యనభ్యసించిన కళాశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయ మన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు రూ.1.20 లక్షల విలువ చేసే 30 బెంచీలను వితరణ చేయడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో రోజ్ ధార్ చారిటబల్ ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవకార్యక్రమాలు చేపట్టి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ప్రతిఒక్కరు తాము సంపాదించిన దాంట్లో ఎంతోకొంత సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడంతోపాటు విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. దాతలు అందజేసిన అనంతరం బెంచీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధినేత మన్సూర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

**కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ప్రజలకు ఉదయం 7గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నిర్విరామంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కారం దిశగా చేపట్టవలసిన చర్యలు అధికారులతో కలసి ఎప్పటికపుడు సమన్వయం చేస్తున్నాం, పరిష్కారం అయ్యే ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన వినతులలో ఇప్పటికే 27 కోట్లతో 240 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. శరవేగం పనులు సాగుతున్నాయి, అతి త్వరలోనే వాటిని ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.జి.హెచ్. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదపర్తి శ్రీనివాసులు, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎల్.పి.కృష్ణ రెడ్డి, ఖాదర్ భాష, ఏఎంసీ డైరెక్టర్ భీమతాటి సుధాకర్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు తోట శోభా రాణి, టిడిపి నాయకులు అజయ్, కటకం చైతన్య, రియాజ్, రాఘవ, సతీష్, రూపక్ తదితరులు పాల్గొన్నారు.

## 4 షాపులు సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన దుకాణాలకు సంబంధించి నెలవారీ బాడుగలు, రెన్యువల్ మొత్తాలు చెల్లించకపోవడం వల్ల కమీషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం అధికారులు శుక్రవారం చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సుబేదార్ పేట షాపింగ్ కాంప్లెక్స్, ఎన్‌సీ బిల్డింగ్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో మొత్తం 4 దుకాణాలను మూసివేశారు. ఎన్‌సీ బిల్డింగ్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాప్ నం.9 రూ.6.18లక్షలు బకాయి, షాప్ నం.15 రూ.6.18లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. అలాగే సుబేదార్ పేట షాపింగ్ కాంప్లెక్స్‌లో షాప్ నం.4 రూ.12లక్షలు బకాయి, షాప్ నం.9 రూ.12లక్షల ఈ షాపులు బకాయిలు చెల్లించని కారణంగా సంబంధిత దుకాణాలను అధికారుల సమక్షంలో మూసి వేసినట్లు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్, వరప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

## తుమ్మల తలుపూరు గ్రామసభ



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని తుమ్మల తలుపూరు గ్రామంలో శుక్రవారం 10గంటలకు గ్రావ సభ నిర్వహించారు. 17వ విడత ఉపాధి హామీ పథకం 2024/2025 పనులకు గాను సామాజిక తనిఖీల్లో భాగంగా తుమ్మల తలుపూరు పంచాయతీలో 390 జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో పనిచేసిన వారు 113 మంది డిఆర్పిలు తనిఖీలు సహకరించిన వారు 91 మందిని కలిసామని తెలిపారు. అయితే ఒకే కుటుంబంలో రెండు జాబ్ కార్డులు ఇవ్వడం విడ్డూరంగా ఉందని, ఒక ఇంటికి ఒక జాబ్ కార్డ్ దే ఉండాలని అట్లా కాకుండా భర్త పేరు మీద ఒక జాబ్ కార్డు భార్య పేరు మీద ఒక జాబ్‌కార్డు ఉండడం గుర్తించామని తెలిపారు. అనంతరం తుమ్మల తలుపూరు పంచాయతీలో 18 వర్కులు చేయగా అందులో హౌసింగ్ 12 ఫీడర్ కెనాల్ 4 హార్టికల్చర్ 2 వీటి మొత్తానికి గాను 9,43,955 రూపాయలు ఇవ్వబడిందని అంతేకాకుండా పంచాయతీరాజ్ కింద సీసీ రోడ్లు 9 వర్కులు జరిగాయి ఆ తొమ్మిది వరకు గాను 29,29,512 రూపాయలు బిల్లులు ఇవ్వడం జరిగిందని సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో 42మంది గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం మేట్, సిహెచ్ బాబు మాట్లాడుతూ.. ఈ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎవ్వరు కుదరకపోవడంతో ఎవరు ఉండడానికి ముందుకు రాకపోవడంతో మా ఊరి టిడిపి నాయకులు దిలీప్ నాయుడు సహకారంతో నేను ఈ మేట్ వర్క్ చేస్తున్నానని సిహెచ్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎ.హరిత, పంచాయతీ కార్యదర్శి కె.కార్తీక్, జూనియర్ అసిస్టెంట్ బి.చిన్నయ్య, టిఏ సురేంద్ర, మేట్, సిహెచ్ బాబు, ఉపాధి కూలీలతో డిఆర్‌పి, కె.చిన్న పెంచలయ్య గ్రామసభ ముగించడం విశేషం.

## అంగరంగ వైభవంగా వెంకటేశ్వరుని రథోత్సవం

● గోవింద నామస్మరణలతో మార్మోగిన పట్టణ వీధులు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణం లోని రామకృష్ణా నగర్‌లో వెలసి ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభ వంగా జరిగింది. దీంతో భక్తులు గోవింద నామస్మరణలతో భక్తిపారవశ్యంలో మునిగి పోయారు. మంగళ వాయిద్యాలు, బాణ సంచా, పండరి భజనలు, కోలాటాలతో సాగిన రథోత్సవం ఆద్యంతం ఆసక్తికరంగా జరిగింది. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రజలు వేలాదిగా ఈ రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేసవి తాపం ఎక్కువగా ఉండటంతో దారి పొడవునా రథం తమ ప్రాంతాల్లోకి రావడంతోనే రథం తో పాటు ఉన్న భక్తులకు ప్రజలు మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర, జ్యూస్ లు తదితర ఆహార పదార్థాలు అందించారు.

## మాజీ ఎమ్మెల్యేని కలిసిన దామిశెట్టి సుధీర్ నాయుడు



**కావలి, మేజర్‌న్యూస్ :** వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన దామిశెట్టి సుధీర్ నాయుడు శుక్రవారం కావలి నియోజకవర్గం ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని వారి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుధీర్ నాయుడు మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయిలో ఇంతటి కీలక బాధ్యతలు అప్పగించిన ప్రియతమ నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, నాకు అండగా నిలిచి ఈ అవకాశం కల్పించేందుకు సహకరించిన కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాముల రోజుల్లో పార్టీ బలోపేతానికి జగనన్న ఆశయ సాధనకు, ప్రతాప్ రెడ్డి నాయకత్వంలో కావలి నియోజకవర్గంలో పార్టీ విజయకేతనం ఎగురు వేసేందుకు అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు కార్యకర్తలు దాంశెట్టి అభిమానులు పాల్గొని వారికి అభినందనలు తెలిపారు.

## బృందావన కాలనీలో సత్యనారాయణ వ్రతం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని బృందావనం కాలనీ ప్రారంభించి ఇప్పటికే 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాలనీవాసులు సత్యం నారాయణ స్వామి వ్రతాన్ని జరుపుటకు నిర్ణయించుకొని జరిపించారు. ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. అనంతరం కాలనీ అంతా మంగళ వాయిద్యాలతో మారు మ్రోగగా మహిళలు, పురుషులు యువత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వ్రతంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరై స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో అభివృద్ధి కొనసాగాలని స్వామివారి ఆశీస్సులు కోరుకున్నారు. అనంతరం కాలనీవాసులు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పుష్పగుచ్ఛం కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బృందావనం కాలనీ స్థాపనకు 30 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం శుభ సమయమని భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వరుడిని ఆశీర్వదించిన బొల్లినేని



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరుకు చెందిన చిమటా వెంకటేశ్వర్లు కుమారుడు చిరంజీవి శ్రావణ్ వివాహ మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన గంధపు నలుగు వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు హాజరై నూతన వరుడిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బొల్లినేని వెంకట రామారావు మాట్లాడుతూ.. శ్రావణ్ దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కలిసి సాంప్రదాయ పద్ధతిలో జరిగిన ఈ వేడుకలో బంధుమిత్రులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడింది. వరుడు కుటుంబ సభ్యులు కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మాస్ హేచరీపై అబద్ధపు ప్రచారాన్ని ఖండిస్తున్న గ్రామ ప్రజలు

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలం వెంకన్న పాలెం గ్రామంలోని మాస్ హేచరీ యాజమాన్యం, గ్రామస్తులు, సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా మాస్ సంస్థ ద్వారా వేలాదిమంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. దాదాపు 1500 మందికి పైగా కార్మికులు ఈ కంపెనీ ద్వారా నిరు పేదలు జీవనోపాధి సాగిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి సంస్థ సహకారం అందిస్తోందని వెల్లడించారు. ఇటీవల కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కంపెనీ నిర్మించుకున్న తాత్కాలిక కట్టడాలపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కట్టడాల వల్ల గ్రామస్తులకు గానీ, గ్రామ పంచాయతీకి గానీ ఎలాంటి ఇబ్బందులు కలగలేదని స్పష్టం చేశారు. ఉపాధి కల్పిస్తున్న సంస్థపై విషప్రచారం చేయడం మానుకోవాలని కోరారు. అనంతరం సంస్థ జనరల్ మేనేజర్ సుధీర్ మాట్లాడుతూ.. తాత్కాలిక అవసరాల దృష్ట్యా



మాత్రమే ఈ కట్టడాలు నిర్మించుకున్నామని తెలిపారు. పంచాయతీ అనుమతులతో, గ్రామస్తుల సహకారంతో సంస్థను ముందుకు తీసుకెళ్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో వెంకన్నపాలెం గ్రామస్తులు, సంస్థ కార్మికులు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాబ్‌మేళాలో 190మందికి ఉద్యోగావకాశాలు : ఆర్డీవో




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో గురువారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన జాబ్‌మేళాలో 190మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు లభించాయని స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావని పేర్కొన్నారు. ఏపి నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో ఆర్డీవో పావని జాబ్‌మేళాను ప్రారంభించి పర్యవేక్షించిన విషయం విధితమే. ఈ జాబ్‌మేళాలో మొత్తం 306మంది హాజరుకాగా 190మంది ఎంపికై ఉద్యోగనియామకపత్రాలు పొందారని ఆమె వివరించారు. మథర్సన్ గ్రూప్‌కంపెనీకి 13మంది, ఏఏఎం జియోస్పాటికల్‌టెక్ కంపెనీకి 17మంది, విజన్‌ఇండియా కంపెనీకి 11మంది, టాటా ఎలక్ట్రానిక్స్‌కు 28మంది, ఫోర్ట్‌మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు 19మంది, హిటరోల్యాబ్స్‌కు ఒకరు, టివిఎస్ లూకాస్‌కు 7మంది, విష్ణుకార్స్‌కు 9మంది, ఏయుస్మాల్‌ఫైనాన్స్‌బ్యాంక్‌కు 11మంది, వీల్స్‌ఇండియాకు 12మంది . డాల్కిన్ ఎయిర్‌కండిషన్ ఇండియాకు 25మంది, బ్లూస్టార్‌కు 8మంది, మెడ్‌ప్లస్‌కు 5మంది, ఎఫికసి ఏఎంఎస్‌కు15మంది, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీకి ఇద్దరు, అరియోస్ ఆగ్రోస్‌కు 7మంది ఎంపికయ్యారు. మొత్తం 21కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థుల విద్యార్హతలు, ప్రతిభ ఆధారంగా ఎంపికచేసి ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారని ఆర్డీవో పావని తెలిపారు.

# నేత.. దాత.. కళాప్రావీణ్యత

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాజకీయనేతగా, ప్రజాప్రతినిధిగా, సామాజికసేవాదాతగా కొన సాగుతున్న గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు కళా ప్రదర్శనలో కూడా ప్రవీణ్యత చూపి పలువురి ప్రశంశలందుకుంటున్నారు. ఆత్మకూరు మండ లం కరటంపాడుకు చెందిన గార్లపాటి వేణు గోపాల్ నాయుడు తెలుగుదేశం నేతగా, బట్టే పాడు పిఏసిఎస్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆయన గతంలో ఎంపిటిసి మెంబర్‌గా గెలు పొంది ఆత్మకూరు ఉపమండలాధ్యక్ష పదవిని చేపట్టి కొనసాగారు. కరటంపాడు సర్పంచ్‌గా విజయం సాధించి ఐదేళ్ళపాటు కొనసాగి ప్రజ లకు సేవలందించారు. తమ గార్లపాటి ఫౌండేషన్ ద్వారా తమ సోదరులు ల్యాంకోగ్రూప్ ఆఫ్‌కంపెనీస్ మేనేజింగ్‌డైరెక్టర్ గార్లపాటి భాస్కర నాయుడు, ల్యాంకో డైరెక్టర్ గార్లపాటి సుబ్బా రావులతో కలిసి అనేకానేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజికసేవాదాతగా పేరుగాంచారు. కాగా ఆయన కళల్లో కూడా ప్రవేశం కలిగి వివిద సందర్భాల్లో తన కళా ప్రదర్శనల్లో అత్యంత ప్రతిభచూపి అందరిచేత ప్రశంశలందుకుంటుంటారు. ఆయన నేతగా, ప్రజాప్రతినిధిగా అన్నివర్గాల ప్రజలకు సేవలం దించారు. దాతగా తమ గార్లపాటి ఫౌండేషన్ ద్వారా కోట్లాదిరూపాయల స్వంత నిధులతో అనేక సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. తమ గ్రామంలోని పాఠశాలకు దశాబ్దకాలంగా పలు భవనాలు, స్టేజి, సరస్వతి విగ్రహం, మండ పం నిర్మించడంతోపాటు ప్రతిఏటా విద్యార్థులకు యూనిఫారం దుస్తులు, నోటుపుస్తకాలు సమకూ రుస్తూ పదవతరగతిలో 9.5జిపిఏ మార్కులు సాధించిన విద్యార్థులు కార్పోరేట్ కాలేజిల్లో చదు వుకునేందుకు లక్ష రూపాయలవంతున స్కాలర్ షిప్‌లు అందజేస్తుంటారు. ఆయన గ్రామంలో, మండలంలో ఉచితంగా మినరల్‌వాటర్, వైద్యసే వలు, వికలాంగులకు ఉపకరణాలు అందజేస్తూ అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తూ సామాజికసేవారత్నగా పేరుగాంచారు. దాదాపు 4కోట్లరూపాయలు వెచ్చించి తమ స్వగ్రామం కరటంపాడులోని ఉన్నతపాఠశాలను సరస్వతి నిలయంగా, ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్ది విద్యార్థులకు అనేక ప్రోత్సహకాలు అందజేశారు. భవిష్యత్తులో కొనసాగిస్తామని పేర్కొన్నారు. గ్రామంలో పాఠశాలలు, పంచాయతీ కార్యాల యం, మరుభూమి, దర్గా తదితరాలకు ప్రహరీలు నిర్మించి మౌళికవసతులు కల్పించారు. అటు



నేతగా, ఇటు దాతగా కొనసాగుతున్న వేణు గోపాల్ నాయుడు కళల్లో కూడా ప్రావీణ్యత చూపుతూ తనవంతు కళామతల్లికి సేవలందిస్తు న్నారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఆయన చూపిన నటన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. సమాజంలోని అన్ని వర్గాలకు సేవలందిస్తున్న వేణుగోపాల్‌నాయుడు అందరి చేతా ప్రశంశలందుకుంటున్నారు. ఆయన వివాద రహితుడు, నిరాడంబరుడు, ఎలాంటి ప్రచారాలు కోరుకునే వ్యక్తికారు. అయినా అపారసామాజిక సేవలందిస్తూ అజాతశత్రువుగా పేరుగాంచి సేవల్లో కొనసాగుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే సొంత నిధులతో

# మంచినీటి సరఫరా



**కావలి, మేజర్‌న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే వందేరు వేణుగోపాల్‌రెడ్డి కావలి నియోజకవర్గ అభివృద్ధికి తను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా తను ఎక్కడ ఉన్నప్పటికీ కూడా తన సొంత ఊర్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మాజీ ఎమ్మెల్యే వందేరు వేణుగోపాల్ రెడ్డికి తెలపడంతో శుక్రవారం గ్రామ ప్రజల అవసరాలకు మేరకు తన భార్య పేరు అయినా ఇందిరా ఉచితం మంచి నీటి సరఫరా ట్యాంకర్లు సొంత నిధులతో ఏర్పాటు చేసి వారి సతీమణి ఇందిరా వారి కుమారుడు వంశీకృష్ణ పూజలు నిర్వహించి, ఉచితం మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ట్యాంకర్ల ద్వారా ప్రారంభించారు. తన సొంత గ్రామానికి, సొంత నిధులతో సేవ చేయాలనే ఉద్దేశం తనకు ఇప్పటికీ ఉందన్నడంలో ఈ కార్యక్రమమే నిదర్శనమని ఆ గ్రామ ప్రజలు తమ నాయకుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షంవ్యక్తం చేశారు.

# గొంగటి రఘునాథరెడ్డిని పరామర్శించిన బొల్లినేని



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు వింజమూరులో మండల టిడిపి మాజీ అధ్య క్షులు గొంగటి రఘునాథరెడ్డిని ఆయన నివాసంలో కలిసి పరామర్శిం చారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని బొల్లినేని విచారించారు. ఈ సందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ.. రఘునాథరెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యు లతో మాట్లాడి ధైర్యం చెప్పి, అవసరమైతే తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృష్ణపట్నంలో ఉచిత వైద్య శిబిరం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామ సచివాలయం కేంద్రంగా శుక్రవారం ఏకేపీఎల్, అదానీ ఫౌండేషన్ సంయుక్తంగా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 210 మందికి ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. అపోలో హాస్పిటల్‌కి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు శిరీష, భరత్ వ్యాస్, సిహెచ్ సుహర్షన్‌రెడ్డి ఆయా విభాగాల వారీగా ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు రాగాల శివకృష్ణ, కోదండ రామయ్య, కృష్ణపట్నం పోర్ట్ అధికారులు మృత్యుంజయ రామ్, రాజేష్ రంజన్, తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాలలో ఎంపీడీఓ తనిఖీలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని ఊటుకూరు, తురిమెర్ల, కలిచేడు స్వర్ణ గ్రామ సచివాలయంలో సైదాపురం మండలం ఎంపీడీఓ ఎంవి మోహన్‌రెడ్డి అకస్మాత్ తనిఖీలు చేశారు. సచివాలయం సిబ్బంది టైం టు టైం డ్యూటీకి వస్తున్నారా లేదా అని తనిఖీ చేయడం జరిగింది. అంతేకాకుండా యూనిఫైడ్ ఫ్యామిలీ బెనిఫిట్ సర్వే, సిటిజెన్, ఈకేవైసీ సర్వే, ఇతర సర్వేల గురించి ఎంతవరకు పని చేశారన్న విషయాలపై చర్చించి మిగతా బ్యాలెన్స్ ఉన్నటువంటి వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎంవి మోహన్‌రెడ్డి తెలిపారు. అనంతరంఆయన సచివాలయంలోని రికార్డులు అన్నీ కూడా పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో ఎంవి మోహన్ రెడ్డి తెలిపారు.

# రథోత్సవంలో జనసైనికుల సేవాని రతి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కళ్యాణ వెంకటేశ్వర స్వామి రథోత్సవంలో జనసేన నాయకులు, కార్యకర్తలు తమ సేవా చాటుకున్నారు. స్వామి వారి రథం జనసేన పార్టీ కార్యాలయం సమీపానికి చేరుకోగానే ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రథం లాగే వారికివారికి మజ్జిగ ప్యాకెట్లు, జ్యూసులను అందించి ఉపశమనం కలిగించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చప్పిడి శ్రీనివాసులురెడ్డి, మండల అధ్యక్షులు మాధవ్, ఉపాధ్యక్షులు ప్రసాద్, కార్యకర్తలు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు

- కాగితాలపూరు చెరువులకు సాగునీరు లిఫ్ట్
- లిఫ్ట్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** రైతుల సమస్యల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నొక్కి వక్కా నించారు. మండలంలోని కాగితాలపూరు చెరువుల కింద మాగాణి భూములకు రాబోయే సాగునీరు ఎద్దడి దృష్ట్యా ముందు జాగ్రత్తగా పొట్టేలు కాలువ చెక్ డాం నుండి పైపులైను వేసి నీరుమళ్లిస్తారు. ఇక్కడ 25 లక్షల రూపాయలు ప్రతిపాదనతో గురువారం నుండి పైపులైన్ నిర్మాణం జరుగుతుంది. ఈ పైపులైనుశుక్రవారం మధ్యాహ్నం పరిశీలించి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పొట్టేళ్ల కాలవ వద్ద చెక్ డాం ద్వారా కాగితాలపూరు లోని గంగా మొగళ్ళ, నల్ల, వినాయక చెరువులకు ఈనెల ఆఖరకు నీళ్లు పైపులు ద్వారా సాగునీరు ఇస్తామని చెప్పారు. టెన్ హెచ్పిపి మోటర్‌తో 7.5 పైప్ లైన్ ద్వారా ఎత్తిపోతల పథకం కిందసాగు నీరు మళ్లించి 400 ఎకరాలను పంటలు కాపాడేందుకు రూ. 25లక్షలతో ప్రతిపాదన చేసి పనులు జరుగుతున్నాయని చెప్పారు. పంటలు ఎండిపోకుండా ఉండేందుకు ఈ లిఫ్టు పనుల ప్రతిపాదనతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదన చేసిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. 2016-17 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెక్‌డ్యాంలు కట్టినందు వల్ల అవి ఇప్పుడు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో జిల్లాలో పలుచోట్ల చెక్ డ్యాములు నిర్మించామని ఎక్కువగా పొదలకూరు మండలంలో ఇవి ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు. 2000 ఆక్వా రంగానికి సాగునీరు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. రైతులు ఎక్కడ ఇబ్బంది పడకూడదని మా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పొదలకూరు మండలంలో చెన్నారెడ్డిపాలెంలో ఒక ఎకరా చవిటి భూమి నీళ్లు లేదని ఆగం చేశారని ఎమ్మెల్యే ఈ సందర్భంగా చెప్పారు. అప్పటి ప్రభుత్వంలో 500 ఎకరాలకురూ 1000వేసుకొని నీళ్లు తెచ్చుకున్నారని రైతుల విషయంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో రాజి లేకుండా పనిచేస్తుందని సోమిరెడ్డి తెలిపారు. దేశంయూరియా కొరత ఉన్నప్పటికీ జిల్లాలో నియోజకవర్గంలో ప్రతి రైతుకు యూరియా ఇచ్చిట్లు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు ఫోన్ చేసిన గంటకి ఎరువులు పంపాడని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ద్విత్వా మొందా తుఫాను సమయంలో రైతులకు 80/0శాతం విత్తనాలు పంపిణీ చేశామని ఎమ్మెల్యే వివరించారు. కాగితాలపూరుకి ఉత్తరంగా పవర్ గ్రిడ్ దగ్గరలో పొట్టేలు కాలువ నుండి రైతుల కొరకు పైపులైను నిర్మాణం చేస్తున్నారు. ఇక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే పనులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులు నీటి సంఘ అధ్యక్షులు వెడిచర్ల వెంకటరమణారెడ్డితో ఇరిగేషన్ పనులు ఎప్పటికీ పూర్తవుతాయి ఎప్పటికి సాగునీరు ఇస్తారని అడిగి తెలుసుకు న్నారు. ఆయన వెంట తహసిల్దార్ రమాదేవి. ఎంపీడీవో జలజాక్షి. ఇరిగేషన్ డి ఈ అనిల్ కుమార్ రెడ్డి. ఏపీ ట్రాన్స్కో ఏఈ అనిల్ కుమార్ ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి సొసైటీ అధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య కనుపూరు కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ వద్దినేని మస్తాన్ నాయుడు, కాగితాలపూరు నీటి సంఘ అధ్యక్షులు వెడిచర్ల వెంకటరమణారెడ్డి నీటి సంఘం ఉపాధ్యక్షులు అడపాల సతీష్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు సన్నారెడ్డి నందగోపాల్ రెడ్డి, తిక్కవరపు శ్రీధర్ రెడ్డి. పిడూరు సర్పంచ్ తిక్కవరపు వెంకు రెడ్డి, కొలనకుదురు నీటి సంఘం అధ్యక్షులు కసిరెడ్డి సునీల్ రెడ్డి, చెన్నూరు సుదీర్‌రెడ్డి సర్వేపల్లి శివకుమార్. జట్ల కొండూరు మాజీ సర్పంచ్ వెందోటి భాస్కర్ రెడ్డి, మాజి సర్పంచ్ మేడికొండ రామా నాయుడు గోనుసుబ్బయ్య గోనుముత్యాలయ్య, మోమిడి ప్రసాద్, హౌసింగ్ ఏఈ శరత్. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కసనా నాయక్, డిప్యూటీ ఎంపీడీవోలు గరుడయ్య శ్రీనివాసులు, వీఆర్వో గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్వెస్ట్మెంట్ పేరుతో ప్రజలను మోసగిస్తున్న ముద్దాయిలు అరెస్ట్




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ఇన్వెస్ట్మెంట్ పేరుతో అధిక లాభాలు పొందవచ్చు అని మాయమాటలు చెప్పి వ్యక్తిని మభ్యపెట్టి అతని వద్ద నుండి 53 లక్షల రూపాయలు ఇన్వెస్ట్ చేయించి సదరు వ్యక్తి ఎన్నిసార్లు అడుగుతున్నా నగదు ఇవ్వకుండా బెదిరింపులు పాల్పడుతున్న ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు శుక్రవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ డా., అజితా వెజెండ్ల వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. ఇన్వెస్ట్మెంట్ పేరుతో ప్రజలను మోసగిస్తూ వారి దగ్గర నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేసుకుని తిరిగి అడిగితే వారిని బెదిరిస్తున్న కూసేటి వేణు గోపాల్ (23) బుచ్చిరెడ్డిపాలెం, బిట్ర వెంకటరమణ (31) బుచ్చిరెడ్డిపాలెం అను ముద్దాయిలు ఈ విధమైన దందాకు పాల్పడుతున్నారని వచ్చిన బాధితుడు ఫిర్యాదు మేరకు బాలాజీ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే సాంబశివరావు వారి సిబ్బంది ఉన్నత అధికారులు సూచనలతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముద్దాయిలు ఉన్న బుచ్చిరెడ్డిపాలెం కి వెళ్లి పరిశీలించగా అక్కడ ముద్దాయిలు తన బంధువులతో కలిసి ఆర్777. యూఎస్ అను లింకు ద్వారా రాది ఎక్స్ఛేంజి యాప్ (ఆర్ 777) క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తున్నట్లు గుర్తించి ముద్దాయిలను విచారించగా. వేణు మరికొందరు ఆర్గనైజర్లు గా ఉన్నట్లు మరో ముద్దాయి వెంకటరమణ నగదును తీసుకొని వచ్చి ఆర్గనైజర్లకు ఇస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఎవరైనా బెట్టింగ్ ఆడే వారు వారి వద్దకు వచ్చి గొడవ చేస్తే వారిని కత్తులతో భయపెట్టి, బెదిరిస్తున్నట్లుగా తెలియజేశారని జిల్లా ఎస్పీ వివరించారు. వారి వద్ద నుండి రూ. 34,65800/-నగదును, రెండు కత్తులు, హెచ్పి లాప్టాప్-1, మొబైల్స్-13, యార్క్ మానిటర్-1, సాంసంగ్ టీవీ-1, అదేవిధంగా బ్యాంక్ అకౌంట్ లో ఉన్నటువంటి రూ. 1,64,74,600/-నగదును సీజ్ చేసి ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు మిగిలిన ఆర్గనైజర్ల కూడా త్వరలో అరెస్ట్ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వెల్లడించారు. అంతేకాకుండా అధిక లాభాలు వస్తాయని చెప్పి ఇన్వెస్ట్మెంట్ పేరుతో మోసం చేసే వారి మాటలకు ప్రజలు లోను కావద్దని, క్రికెట్ బెట్టింగ్ ఆడిన, నిర్వహించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని,జూదం వల్ల కుటుంబాలు నాశనం అవుతాయని బెట్టింగ్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఇన్వెస్ట్మెంట్, బెట్టింగ్ లేదా జూద కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా డైల్112 కు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం ముద్దాయిలను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన బాలాజీ నగర్ సిఐ కే సాంబశివరావు, ఎస్సై పి విజయ శ్రీనివాస్, వారి సిబ్బంది కెవి సుధాకర్, సిహెచ్ రమేష్, జయరామయ్య, శివకుమార్, శ్రీహరి, పార్థసారథి, సాయి కిషోర్, లాజర్లను ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, నెల్లూరు టౌన్ ఎఎస్పి దీక్ష, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మిక నేత గురిజాల కృష్ణారావు నేత్రదానం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుడిగా 3 దశాబ్దాలపాటు పనిచేసి, ప్రస్తుతం విశ్రాంత ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం, కృషి చేస్తున్న ప్రముఖ కార్మిక నేత గురిజాల కృష్ణారావు (72) శుక్రవారం ఉదయం తెల్లవారు జామున గుండెపోటుతో మరణించారు. ఆయన కుమార్తెలు ఎం.రాణి సంయుక్త, ఏ మాధురి, రెడ్‌క్రాస్ జీవిత సభ్యుడు వేమిరెడ్డి శరత్ కుమార్ రెడ్డిని సంప్రదించి, నేత్రదానంకు అంగీకారం తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి నేత్రదానంకు ఏర్పాట్లు చేశారు. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి కార్నియా రికవరీ స్పెషలిస్ట్ గద్దె సునీల్ కుమార్ కార్నియాలను సేకరించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు కలికి శ్రీహరిరెడ్డి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. శిరిడీ సాయిబాబా భక్తుడైన కృష్ణారావు గత రెండు దశాబ్దాలుగా ఆర్టీసీ గ్యారేజ్ ప్రక్కనున్న నందదీప్ సాయి సమాజ్ వారి సాయిబాబా దేవాలయంలో కార్యాలయ నిర్వహకుడిగా పనిచేస్తూ ఉండడంతో పలువురు సాయి భక్తులు కృష్ణారావు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగ కన్వీనర్ మాట్లాడుతూ.. ఇది కావలి రెడ్ క్రాస్ ద్వారా జరిగిన 168వ నేత్రదానమని తెలిపారు.

## ఇనమడుగులో ఉచిత వైద్యశిబిరం



**నెల్లురు సిటీ, మేజర్‌న్యూస్ :** ఇనమడుగు గ్రామములోని కనకదుర్గమ్మ ఆలయము ముందర గుడి గడప ప్రారంభోత్సవము సందర్భముగ జరిగిన కార్యక్రమములో భాగంగా భక్తులకోరకు ఉచితహోమియో వైద్యశిబిరాన్ని నిర్వహించడము జరిగింది ఉచితముగా ఆరోగ్యపరీక్షలు చేసి తగిన హోమియో మందులను ఇవ్వడము జరిగింది సీజనల్ వ్యాధులు ఏండలు పెరుగుతున్న దృష్ట్య తీసుకోవల్సిన జాగ్రత్తలను కూడవివరించడము జరిగింది శ్యాసకోసవ్యాదులు, చర్మవ్యాదులు అల్లర్జీ బిపి షుగర్ సంబంద వ్యాదులను గమనించడము జరిగింది.

## రాపూరులో ఫాగింగ్ ప్రారంభం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు పట్టణంలో దోమల నివారణకు డీపీఓ ఆదేశాల మేరకు ఫాగింగ్ కార్యక్రమాన్ని సర్పంచ్ భూపతి జయమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమం డివిజనల్ పంచాయతీ అధికారీ డాక్టర్ పుట్టా రమణయ్య సమక్షంలో నిర్వహించడం జరిగింది. పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలకృష్ణా రెడ్డి, ఏఎన్ఎం హరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పనుల బకాయిలపై క్యాంపెయినింగ్




**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు గ్రామపంచాయతీలో ఇంటి పనుల బకాయిలు రూ. 1.20 లక్షలు పేరుకుపోవడంతో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు రాపూరు పంచాయతీతో పాటు, మండలంలో ఇంటి పన్నువసూలుపై డివిజనల్ పంచాయతీ అధికారి డాక్టర్ పుట్ట రమణయ్య క్యాంపైన్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాపూరు పట్టణంలో పంచాయతీ సిబ్బందితో కలిసి డిఎల్పీఓ డాక్టర్ పుట్టా రమణయ్య ఇంటింటికి వెళ్లి క్యాంపెయినింగ్ నిర్వహించారు.

# దేవదేవునిపై రాజకీయమా?

- గత ప్రభుత్వం చేసిన అరాచకాలు హిందుత్వ వ్యతిరేక ధోరణలు ఐదు సంవత్సరాలు అనుభవించాం
- 11 స్థానాలకు పరిమితం చేసిన ప్రజలు
- రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి అధ్యక్షతన మీడియా సమావేశం జరిగింది. మీడియా సమావేశంలో రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ మాట్లాడుతూ.. శాసనమండలిలో వైఎస్ఆర్సిపి సభ్యుల ప్రవర్తన హిందూ సమాజానికి వ్యతిరేకంగా రాజ్యాంగానికి శాసనసభ యొక్క విశిష్టతను అవమానించే విధంగా ప్రవర్తించడం 2019 నుంచి 2024 వరకు ఉన్న ప్రభుత్వం చేసిన అరాచకాలు హిందుత్వ వ్యతిరేక ధోరణలు ఐదు సంవత్సరాలు అనుభవించామని అందుకు ప్రజలు వారిని 11 స్థానాలు పరిమితం చేశారని వారి ప్రవర్తనలో మార్పు లేదని కలియుగ ప్రత్యక్ష దైవమైన ఆ దేవదేవుడిని మనమందరం ప్రత్యక్ష దేవుడుగా భావిస్తున్నామో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ భక్తులందరూ ఎంతో స్వామి వారి పట్ల ఎంతో భక్తి భావాలతో ఉంటారు అటువంటి స్వామి వారి విషయంలో వైసీపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కల్తీ నెయ్యి ఉపయోగించి అపచారం చేసి తప్పులు ఒప్పుకోకుండా వాళ్ళ యొక్క ప్రవర్తన అలాగే సిట్ గాని సిబిఐ ఏర్పాటు చేసిన రిపోర్టులు ఒకటి చెబుతూ ఉంటే వారు ఇంకొకటి మాట్లాడుతున్నారు. ఇవాళ జరిగినటువంటి అంశం శాసనమండలిలో వారు వచ్చి దాని మీద చర్చ చేయాలి అంటే చైర్మన్ దాన్ని తోసిపుచ్చారు. మండలి చైర్మన్ దాని కాదు అన్న తర్వాత చైర్మన్‌కి శాసనమండలికి గౌరవం ఇవ్వకుండా అరాచకంగా వారు వస్తూ స్వామివారి ప్లే కార్డ్స్ పట్టుకొని రాజకీయాల్లో లేని విధంగా దేవదేవుని కూడా రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఏమో దేవునికి అపచారం చేసి కూడా శాసనమండలిలో ఆ ప్లే కార్డ్స్ చూపిస్తూ చర్చ చేయాలని నినాదాలు చేయటం ఎప్పుడైతే చైర్మన్ దాన్ని రిజెక్ట్ చేశారో వారు ఎంత దారుణంగా సామాన్య ప్లే కార్డ్స్‌ని పరేసినట్టుగా స్వామివారి చిత్రపటాలను టేబుల్ మీదికి విసిరేసి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. దీన్నిబట్టి వాళ్లు ఎంత హిందూ వ్యతిరేకవాదులో అలాగే మొదటి నుంచి వైయస్సార్సీపి హిందూ వ్యతిరేక పార్టీగా అలాగే అప్పుడు రాష్ట్రంలో ఎన్నో గుళ్లను ధ్వంసం చేశారు. అందరం చూసామని హిందూ భావజాలం మీద నమ్మకం లేని వ్యక్తి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఏనాడైనా సరే ధర్మపత్ని సమేతంగా వస్త్రాలు సమర్పించారా అని అడుగుతున్నాము. అలాగే ఎప్పుడు హిందూ సమాజానికి ఏమి చేయలేని వ్యక్తి సమాజానికి ఉద్ధరిస్తున్నట్టుగా మాట్లాడటం ఎంతవరకు సమంజసం అందుకు మనమందరం సిగ్గుపడాలని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదనాలన్నీ సరిదిద్దుతూ టీటీడీ లో ఉన్న బిఆర్ నాయుడు ఎన్నో సంస్కరణ తీసుకొచ్చారని తిరుమల తిరుపతి ప్రాసిస్టాన్ని తిరిగి తీసుకొస్తున్నారని గతంలో వైఎస్సార్ సీపీ చేసిన భూ సంరక్షణ ఎలా చేశారో అలాగే లడ్డులో కల్తీ చేశారని ఇటువంటి వీరు శాసనమండలిలో దూసుకొచ్చి ప్రవర్తించిన తీరు దుర్మార్గమని భారతీయ జనతా పార్టీ దీని తీవ్రంగా ఆక్షేపిస్తా ఉంది అందుకు వారు అందరికీ క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తా ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, మాజీ రాష్ట్ర ఎస్సీ మోర్చా బైరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్, మీడియా ఇన్‌చార్జ్ చిన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

# రాత్రికి రాత్రే పారుదల తంబల తొలగించిన దుండగులు



## 150 ఎకరాల పంటలకు ముప్పు

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు పంచాయతీలో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పారుదల కాలువ తంబలను కొందరు వ్యక్తులు రాత్రి వేళలో జెసిబి సహాయంతో అక్రమంగా తొలగించడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆ కాలువ కింద సాగు చేస్తున్న రైతులు అత్యవసరంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి తమ గోడును వెల్లగక్కారు. సుమారు 150 ఎకరాల వ్యవసాయ భూమికి ఈ కాలువ ద్వారా నీటి సరఫరా జరుగుతోందని, ప్రస్తుతం పంటలు కోత దశలో ఉన్న కీలక సమయంలో తంబలను తొలగించడం వల్ల నీటి ప్రవాహం అసమతుల్యంగా మారి పైరులు ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కోతలు పూర్తయ్యాక పెద్ద తంబలు ఏర్పాటు చేస్తామని ముందుగా హామీ ఇచ్చినప్పటికీ, ఎలాంటి సమాచారం లేకుండా రాత్రికి రాత్రే దౌర్జన్యంగా తంబలు తొలగించడం రైతులపై నేరుగా దాడి చేసినట్టేనని మండిపడ్డారు. గతంలో ఇరిగేషన్ అధికారులు స్థలాన్ని పరిశీలించినప్పటికీ శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై కూడా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని తంబలను పునరుద్ధరించి పంటలను రక్షించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు. రైతుల జీవనాధారాన్ని దెబ్బతీసే చర్యలను ప్రభుత్వం వెంటనే అడ్డుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యాబోధనలో చిత్తశుద్ధి.. పాఠశాల వృద్ధిలో సేవానిరతి

- ఆదర్శంగా ఉపాధ్యాయిని అనూరాధ






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వృత్తిపట్ల గౌరవబావం కలిగి విద్యార్థులకు ఉత్తమమైన బోధన అందిస్తూ చిత్తశుద్ధిగా విధులు నిర్వహించడంతోపాటు పాఠశాల అభివృద్ధికి తనవంతుగా కృషిచేసిన ఉపాధ్యాయిని ఏ.అనూరాధ అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఆమె 2017లో ఆత్మకూరు పట్టణంలోని జ్యోతినగర్ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో ఆపాఠశాల భవనాలకు ప్రహరిలేక, ముంగిట రోడ్డు గుంటలమయమై ఉంటూ విద్యార్థులకు అత్యంత అసౌకర్యంగా ఉంటుండేది. అనూరాధ తచ విధులను చిత్తశుద్ధిగా నిర్వహిస్తూనే పాఠశాలను అభివృద్ధి పరచాలని తలంచారు. ఆవార్డు మున్సిపల్ కౌన్సిలర్ డక్కా రమణమ్మ, టిడిపి నాయకుడు డక్కా మల్లికార్జునల సహకారంతో ప్రభుత్వం నుండి సిమెంటు రోడ్డు మంజూరుచేయించి పాఠశాల ముంగిట రోడ్డు నిర్మింపజేయడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అనంతరం పాఠశాల భవనాలకు ప్రహరీలేక నిరంతరం కుక్కలు ప్రవేశిస్తూ విద్యార్థులు అభ్యశించేందుకు, మధ్యాహ్నం భోజనం చేసేందుకు అత్యంత ఇబ్బందికరంగా ఉండగా అనూరాధ దృష్టి సారించారు. పట్టుదలగా ఈఇబ్బందిని తొలగించాలన్న సంకల్పంతో పలువురు దాతల సహకారంతో విరాళాలు, తనవంతుగా కొంత నగదు సమకూర్చడంతోపాటు తన కుమార్తె ప్రముఖ దంతవైద్యనిపుణులు డాక్టర్ నుండి కూడా విరాళం సేకరించి దాదాపు 1లక్షా30వేల రూపాయలతో భవనాలకు గ్రిల్స్ వేయించారు. రెండు తరగతి గదుల బాత్‌రూమ్‌లకు ప్రహిరి నిర్మింపజేశారు. మహిళా టీచర్‌గా ఈపాఠశాలలో విధులు సక్రమంగా నిర్వహిస్తుండడంతోపాటు పాఠశాల అభివృద్ధికి కూడా ఆమె ప్రత్యేక శ్రద్ధతో కృషిచేయడాన్ని కాలనీవాసులు కొనియాడారు. 2005వసంవత్సరంలో ఆమె ఈపాఠశాల నుండి స్థానిక ఏసిఎస్ఆర్ కాలనీ పాఠశాలకు బదిలీ అయ్యారు. అనూరాధ హయాంలో తమ పాఠశాల ఆకర్షణీయంగా మారిందని, విద్యార్థుల అసౌకర్యం, ఇబ్బంది తొలిగిపోయాయని కాలనీవాసులు పలువురు పేర్కొంటూ ఆమె సేవానిరతిని కొనియాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈవిధంగా విద్యార్థులకు సక్రమంగా బోధనగావిస్తూ పాఠశాల అభివృద్ధికి కూడా కృషిచేస్తుండడం ఆదర్శనీయంగా ఉంది.

# వైభవంగా అమ్మవారికి ఉద్యాపన పూజ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం విశేషంగా రాహు కాల ఉద్యాపన పూజలో శ్రీ అమ్మవారికి చీరజాకెట్టు, 108 నిమ్మకాయల మాలలు సమర్పించారు. రాహుకాల దీపాలు చేసిన శ్రీ అమ్మవారిని దర్శించుకొన్నారు. ప్రతి శుక్రవారం భక్తుల విరాళముల ద్వారా దేవస్థానం తరవున అన్నదాన కార్యక్రమం జరుగుచున్నది. ఈ శుÂవారరం రెండు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేయుట జరిగింది. అన్నదాన కార్యక్రమంను భక్తులు ఇచ్చిన విరాళములు ద్వారా నిర్వహించుట జరుగచున్నది. సాయంత్రం వేదపారాయణం, సంధ్యామేళం, రాత్రి కుంభ హారతులు, పల్లకీ సేవ కార్యక్రమాలు జరిగినవి అని ఆలయ చైర్మన్ ఏలూరు శిరీష, సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

# మా భూమి మాకు ఇప్పించండి

- రైతు కుటుంబం అధికారులను వేడుకోలు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో జలదంకి మండలం రామర్పాడు గ్రామనికి సంబం ధించిన రైతులు జర్నలిస్ట్ క్లబ్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. రామార్పాడు గ్రామానికి చెందిన రైతు మారినేని వెంకటేశ్వర్లు, వరలక్ష్మి 37 సంవత్స రాలుగా ఇదే గ్రామంలో ఉంటున్నామని మాకు సెంటు భూమిలేదని ఉండడానికి ఇల్లు కూడా లేదని రికార్డ్ అని మా బ్రతుకులకు ఆ 50 సెంట్లు ఆధారమని తెలిపారు. అయితే మా భూమిలో ఆశగా వేసుకున్న జామాయిల్ మొక్కలను మా గ్రామానికి చెందిన సర్పంచి భర్త అయినా ఉన్నం రవీంద్రబాబు ఆధ్వర్యంలో కడియాల వినోద్ కుమార్, ఉమామహేశ్వరరావు, మాదాల మురళీకృష్ణ, కడియాల కిరణ్ కుమార్ జెసిబిలతో తొక్కించి నాశనం చేశారని తెలిపారు. ఈ విషయం తెలిసి వారిని ప్రశ్నిస్తే మీకు దిక్కున చోట చెప్పుకోండి అవసరం అయితే మిమ్మల్ని కూడా ఈ గ్రామం నుంచి వెలివేస్తామని బెదిరించారని తెలిపారు. గ్రామంలో ఈ 50సెంట్లు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని గ్రామంలో మాకు ఎటువంటి ఆస్తి పాస్తులు కూడా లేవని తెలిపారు. మాకు ఎవరు లేరని తలంపుతో వారు మమ్మల్ని బెదిరిస్తూ మాకు ఉన్న ఆ 50 సెంట్లు భూమిని బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. మాకు వారి నుంచి ప్రాణహాని ఉందని కన్నీరుమున్నీరయ్యారు. పేదలమైన తమపై జరుగుతున్న ఈ అన్యాయంపై ఉన్నత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# మైనార్టీల సంక్షేమమే లక్ష్యం

- రంజాన్ మాస కార్యక్రమాలపై మత పెద్దలతో రమాదేవి చర్చలు
- ముస్లిం సోదరులకు అండగా ప్రభుత్వం
- రంజాన్ ఏర్పాట్లపై గోమతి క్యాంప్ కార్యాలయంలో సమీక్ష?
- మంత్రి నారాయణ సతీమణి రమాదేవి

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని గోమతి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి వర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి శుక్రవారం ముస్లిం మైనార్టీ నేతలు, మత పెద్దలతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరుల కోసం చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలు, మైనార్టీల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై ఈ సందర్భంగా వారు సుదీర్ఘంగా చర్చించారు. మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల మత పెద్దలు సంతృప్తి వ్యక్తం చేస్తూ, పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.